వప్పుకుతీరాలి. అవును ఎంతో మంచివాడు మా సుధ.

ప్రకాశం రవితో, "ఇప్పుణ్ణా దగ్గిర అయిదున్నాయి. అందాకా పట్టికెళ్ళు. మిగతా ఇరవై ఇవాళ పదో తారీక్కదూ? ఇవాళే రైల్వేవాళ్ళ జీతాల్రోజు. బాబులు నాకు సొమ్మివ్వాలి. అడిగి తెస్తాను. సాయంకాలం రా!" అన్నాడు సుధ. అతనికి రవిని చూసి చిన్నమెత్తు అసూయా ఎక్కువగా జాలీ కలిగేయి. "అయితే, సాయంకాలం నామాట మర్చిపోకుస్మా! మర్చిపోతే చచ్చిపోతాను!" అంటూ లేచి వెళ్ళిపోబోతున్న రవిని ఆపి.

"రవీ! పెళ్ళి చేసుకున్న గుమాస్తాకి పరమ వీరచక్రం ఇవ్వొచ్చు రవీ!" అన్నాడు సుధ.

"మిగతా ఇరవై ఇస్తే నాకు ప్రాణాలిచ్చినట్లే లెక్క" అన్నాడు రవి.

జీతాల రోజేకాని బాబులు ఆఫీసుకి వెళ్ళలేదు. తోడి గుమాస్తాకి తన జీతం పుచ్చుకొనే ఆథరైజేషన్ లెటరిచ్చి సెలవుపెట్టి ఇంటి దగ్గరే వుండిపోయేడు.

బాబులికి రవీంద్రనాథ్‌ఠాకూరంటే ఇష్టం లేదు. ఎంచేతనంటే అతనికి కాబూలీ భయం వుంది. చెల్లుల్లేని వడ్డీలు చెల్లించి చెల్లించి మరి చెల్లించలేక చేతులెత్తి నిల్చున్న బాబుల్ని కాబూలీవాడు సివిల్ జెయిల్‌కి పంపిద్దామని చూసేడు. "నేను ఇచ్చుకోగలిగిన్ని ఇచ్చుట మానివేయడం లేదనిన్నీ, నేను కానీ మిగలకుండా కాలక్షేపం చేస్తున్నవాడిననిన్నీ" బాబులు కోర్టువారికి నిరూపించుకొని జెయిలు తప్పించుకున్నాడు. జీతంలో మిగతా అప్పులవాళ్ళు కోతలు అప్పటికప్పుడే పోతూనే వుండడంచేత కాబూలీవాడికి ఆఫీసు గేటు కాయక తప్పింది కాదు. అందుచేత జీతాల రోజుల్లో బాబులు ఆఫీసుకి వెళ్ళడు.

బాబులు ముఖం, అప్పుల వాళ్లెక్కడ కనిపిస్తారో అని కనిపెట్టుకు తప్పించుకు తిరిగే యాభయ్యేళ్ళ ముఖంలా వుంటుంది. అతని జుట్టు డెబ్భయ్యేళ్ళదాన్లా వుంటుంది.

అతనెప్పుడూ తోడేళ్ళకి భయపడే ముసిలి కుందేల్లా కనిపిస్తాడు. గడపదాటి వీధిలో కెప్పుడొచ్చి తిరిగినా, పిల్లి వున్న ఇంట్లో ఎలక తిరిగినట్టు వారవారలంట తిరుగుతాడు. ఎవరైనా అతన్ని ఇంటికి వెళ్ళి పిలిస్తే అతను వెన్వెంటనే బైటకిరాడు. ఆ వచ్చిన వ్యక్తి 'క్రూరజంతువు' కాదని నిర్ధారణయితేగాని తలుపుతియ్యడు. ఇంట్లో వాళ్ళని "బాబులున్నాడా?" అని అడిగితే ఎందుకైనా మంచిదన్చెప్పి వాళ్ళెప్పుడూ "లేరు లేర"నే జవాబు చెప్తారు. ఆఫీసుకి వెళ్లే టైంకి బాకీదార్లు దారికాస్తారని భయపడి అతను టైంకి రెండు గంటలముందే ఆఫీసుకి పోయి కూర్చుంటాడు. లోనికి వెళ్లేక కాఫీక్కూడా మళ్ళీ బైటకిరాడు. ఆఫీసునుంచి ఇంటికి రాడంలో కూడా అతను ఎంతో చాతుర్యం చూపిస్తాడు. అతను ఒక్కొక్కప్పుడు ఇంటికి వెళ్ళనే వెళ్ళకుండా స్నేహితుల ఇళ్ళ దగ్గిర ఉండిపోతుంటాడు. అతను కత్తులమీద నడిచేవాళ్ళాగా నిప్పుల మీద గెంతేవాళ్ళాగా కనిపిస్తాడు. కొత్తగా వచ్చే కుర్ర గుమాస్తాలతో అతను "ఒరిజినల్ గుమాస్తాగాణ్ణి నేనూ! కార్బన్ కాపీగాళ్ళు మీరు," అంటూంటాడు.

బాబులనే జగన్నాథానికి నలభయ్యేళ్ళ వయస్సులో ఇప్పుడీరోజున, పెళ్ళికాని చదువులేని ఇరవైరెండేళ్ళ కూతురూ, మెట్రిక్కు పాసవని నౌఖరీ దొరకని పెళ్ళికాని ఇరవయ్యేళ్ళ కూతురూ, చదువు సరిగా అబ్బని పద్దెనిమిదేళ్ళ కొడుకూ, పదకొండో యేటనుంచీ పెళ్ళికోసం తహ తహ లాడిపోతున్న పదహారేళ్ళ కూతురూ, ఎడంకాలు ఎండిపోయిన పన్నెండేళ్ళ కొడుకూ,

